మార్పు కోసం...
# మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

విలేకరులు కావలెను
హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను
మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 217 28 ఆదివారం, జనవరి 2024 పేజీలు: 4/వెల రూ5/-

# ఇండియా కూటమికి బీటలు..

## ఏం జరుగుతుందో చూద్దాం అన్న మల్లికార్జున ఖర్గే

**జనవరి 27 : మరో ఉదయం**

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ను గద్దెదించడమే లక్ష్యంగా ఏర్పాటైన 'ఇండియా' కూటమిలో విభేదాలు బయటపడ్డ విషయం తెలిసిందే. ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ ఒక్కొక్కరిగా కూటమిని వీడుతున్నారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. ఇక జేడీయూ చీఫ్, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సైతం అదే బాటలో పయనిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన ఎన్డీయే కూటమిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పందించారు. 'ఇండియా' కూటమిలో విభేదాలు తొలగించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి నుంచి జేడీయూ వైదొలగడంపై తనకు ఎలాంటి సమాచారం లేదని అన్నారు. నితీశ్ కుమార్‌కు లేఖ రాశానని, ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించినట్లు ఖర్గే చెప్పారు. అయితే, నితీశ్ మనసులో ఏముందో తనకు తెలియదని అన్నారు. రేపు ఢిల్లీ వెళ్లి పూర్తి సమాచారం తెసుకుంటానని చెప్పారు. రానున్న రోజుల్లో ఏం జరుగుతుందో చూద్దాం అంటూ వ్యాఖ్యానించారు. ఇక కూటమిలో అందరినీ ఏకం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శాయశక్తులా ప్రయత్నిస్తోందని ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్ర, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో తాను మాట్లాడినట్లు చెప్పారు. రాబోయే లోక్ సభ ఎన్నికల్లో మనం ఐక్యంగా ఉండాలని, అప్పుడే మంచి పోరాటం చేయగలమని వారితో చెప్పినట్లు ఖర్గే వివరించారు. ఇండియా కూటమి బాగా పనిచేయాలని, ప్రజాస్వామ్యాన్ని



రక్షించాలని కోరుకునే వారు తొందరపాటు నిర్ణయం తీసుకోరని ఈ సందర్భంగా ఖర్గే వ్యాఖ్యానించారు.

# ప్రాజెక్టులవారీగా ఆయకట్టు వివరాల్లో గందరగోళం

**సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అధికారుల హాజరు**

**గ్రామాలు, మండలాల వారీగా ప్రాజెక్టుల ఆయకట్టు వివరాలు సిద్ధం చేయాలని ఆదేశం**

**పెండింగ్ ప్రాజెక్టుల పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్న రేవంత్ రెడ్డి**



**జనవరి 27 : మరో ఉదయం**

ప్రాజెక్టులవారీగా ఆయకట్టు వివరాలలో గందరగోళం కనిపిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సచివాలయంలో ముఖ్యమంత్రి నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, సంబంధిత శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామాలు, మండలాల వారీగా ప్రాజెక్టుల ఆయకట్టు వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు పెండింగ్ ప్రాజెక్టుల వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో... ప్రాధాన్యతల వారీగా పెండింగ్ ప్రాజెక్టుల పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పరిస్థితిపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. కల్వకుర్తి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ఎందుకు ముందుకు సాగడం లేదని అడిగారు. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ పనులను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. ఎస్ఎల్బీసీ పూర్తి చేస్తే 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరును అందించవచ్చునన్నారు. కొన్ని ప్రాజెక్టులను గ్రీన్ ఛానెల్ ద్వారా వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# ఇంతకంటే ఎక్కువ ఆశించలేం

**ఉరవకొండలో రా కదలి రా సభ**

**ఈ ముఖ్యమంత్రికి బుద్ధి ఉందా అంటూ చంద్రబాబు ఫైర్**

**ఉల్లిగడ్డకు, ఆలుగడ్డకు తేడా తెలియని ముఖ్యమంత్రి అంటూ వ్యంగ్యం**

**వ్యవసాయం గురించి ఏం తెలుస్తుంది అంటూ విమర్శలు**



**జనవరి 27 : మరో ఉదయం**

టీడీపీ అధినేత చంద్రబాబు అనంతపురం జిల్లా ఉరవకొండలో ఏర్పాటు చేసిన రా కదలిరా సభలో సీఎం జగన్ పై ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో తాము 10 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను తీసుకువస్తే, దాన్ని ఈ ముఖ్యమంత్రి పక్కనబెట్టేశాడని మండిపడ్డారు. రూ.30 కోట్ల సామగ్రిని తుప్పు పట్టించాడని ఆరోపించారు.

"ఈ ముఖ్యమంత్రికి బుద్ధి ఉందా అని అడుతున్నా... రూ.30 కోట్ల ప్రజాధనం వృథా చేసిన ఈ ముఖ్యమంత్రికి అర్హత ఉందా అని అడుగుతున్నా. ఈ ముఖ్యమంత్రి నుంచి ఇంతకంటే ఎక్కువ ఆశించలేం... ఎందుకంటే ఈయన ఉల్లిగడ్డకు, ఆలుగడ్డకు తేడా తెలియని ముఖ్యమంత్రి. ఇక వ్యవసాయం గురించి ఏం తెలుస్తుంది? టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చాక రైతులకు మళ్లీ పాత బీమా సదుపాయం తీసుకువస్తాం. రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తాం" అని చంద్రబాబు వెల్లడించారు.

### పోయేటప్పుడు నోటిఫికేషన్ ఇస్తున్నాడు... ఎవర్ని మోసం చేస్తాడు?

ఇవాళ ఉరవకొండ సభకు యువత పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వారు వైసీపీని భూస్థాపితం చేయాలని అనుకుంటున్నారు. జాబ్ క్యాలెండర్ వచ్చిందా? డీఎస్సీ ప్రకటించారా? ఆ రోజున ఏం చెప్పారు...? ఎవరికైనా ఒక్క ఉద్యోగం వచ్చిందా? ఇప్పుడు పోతున్నాడు... పోయేటప్పుడు నోటిఫికేషన్ ఇస్తాడంట! ఎవర్ని మోసం చేస్తావు?

నేను ఐటీ ఉద్యోగాలు ఇచ్చాను, టీచర్ ఉద్యోగాలు ఇచ్చాను. మీరిచ్చిన ఉద్యోగాలు ఏంటి... వాలంటీరు ఉద్యోగాలు. లేకపోతే ఫిష్ మార్టుల్లో, మద్యం షాపుల్లో ఉద్యోగాలు ఇచ్చారు. టీడీపీకి, వైసీపీకి ఉండే తేడా ఇదే.జాబు రావాలంటే బాబు రావాల్సిందే. మరి బాబు రావాలంటే మీరేం చేస్తారు? సైకిల్ ఎక్కండి... 74 రోజులు మీరు కష్టపడండి... ఆ తర్వాత మీ జీవితాల్లో వెలుగు తీసుకువచ్చే బాధ్యత నాది. మరి మీరు సిద్ధమైతే నేను కూడా సిద్ధం. మీరు పది అడుగులు వేయండి... నేను వంద అడుగులు వేస్తా.

తమ్ముళ్లూ.... నాకు మీకంటే ఎక్కువ ఆవేశం ఉంది. వయసనేది ఒక నెంబరు మాత్రమే. మరో 20 ఏళ్లలో ఏం చేయాలని ఆలోచిస్తున్నా. 2047 నాటికి తెలుగుజాతి ప్రపంచంలో నెంబర్ వన్ గా ఉండాలి. అదే నా జీవిత లక్ష్యం. పేదరికం లేని సమాజాన్ని చూడాలనేది నా ఆశయం.

### యువతకు ఇదే నా హామీ

ఉరవకొండ సభ నుంచి యువతకు హామీ ఇస్తున్నా. సంవత్సరానికి 4 లక్షల ఉద్యోగాలు ఇస్తాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే బాధ్యతను టీడీపీ-జనసేన ప్రభుత్వం తీసుకుంటుంది. పరిశ్రమలను పెద్ద ఎత్తున తీసుకువస్తాం. వర్క్ ఫ్రమ్ హెూమ్ విధానంలో ఇంటి వద్ద నుంచే ఉద్యోగాలు చేసుకునే ప్రణాళికకు శ్రీకారం చుడతా. ఒకవేళ వర్క్ ఫ్రమ్ హెూమ్ బోరు కొడితే, మండల కేంద్రాల్లో వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసి అక్కడికెళ్లి పనిచేసుకునే విధానం తీసుకువస్తాను. ఉద్యోగాలు వచ్చే వరకు యువతకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తాను. తల్లిదండ్రులపై ఆధారపడనక్కర్లేదు. మీకు అన్నగా నేనుంటా... నేరుగా మీ ఖాతాల్లోకే రూ.3 వేలు జమ చేస్తాం. ఆ బాధ్యత నాది అని యువత అందరికీ హామీ ఇస్తున్నా.

# 10 సీట్లు వచ్చినప్పుడే వెనకడుగు వేయలేదు.. ముళ్లబాట.. పూలబాట చూశాం

**అబద్ధాలు చెప్పి గెలిచిందన్న హరీశ్ రావు**

**బీఆర్ఎస్ 1.08 ఓట్ల తేడాతో మాత్రమే ఓడిపోయిందని వెల్లడి**



మిగతా 3 లో

లంకె బిందెలు ఉన్నాయని వస్తే ఖాళీ బిందెలు కనిపించాయన్న రేవంత్ వ్యాఖ్యలకు కౌంటర్‌మనకు 10 సీట్లు వచ్చినప్పుడు కూడా వెనకడుగు వేయలేదని... బీఆర్ఎస్ ముళ్ల బాట... పూలబాట రెండింటినీ చూసిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేటలోని ఓ గార్డెన్‌లో ఈ రోజు ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 1.08 శాతం ఓట్ల తేడాతో మనం అధికారం కోల్పోయామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి గెలిచిందని ఆరోపించారు. అధికారంలో ఉన్న వారిని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? అని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమాలు, దాడులు, బెదిరింపులు కొత్త కాదన్నారు.

# తెలంగాణలో పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల రాయితీ గడువు పొడిగింపు

**పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల రాయితీ గడువు పొడిగించేది లేదన్న పోలీసులు**

**రాయితీతో కూడిన చెల్లింపులకు నాలుగు రోజుల సమయమే ఉందని వెల్లడి**

**ఈ నెలాఖరు వరకు రాయితీతో కూడిన చెల్లింపుకు అవకాశం**

**జనవరి 27 : మరో ఉదయం**

తెలంగాణలో పెండింగ్ చలాన్ల రాయితీ గడువును మరోసారి పొడిగించే అవకాశం లేదని పోలీసులు స్పష్టం చేశారు. గత ఏడాది డిసెంబర్ 27వ తేదీ నుంచి పెండింగ్ చలాన్లను రాయితీతో చెల్లించేందుకు అవకాశమిచ్చారు. తొలుత పదిహేను రోజులపాటు అవకాశమిచ్చిన పోలీసులు ఆ తర్వాత జనవరి 10 నుంచి ఈ నెలాఖరు వరకు పొడిగించారు. తద్వారా పెండింగ్ చలాన్ల రాయితీ చెల్లింపులకు నెల రోజులకు పైగా సమయం దొరి కింది.అయితే ఇక గడువు పొడిగింపు మాత్రం ఉండదని పోలీసులు స్పష్టం చేశారు. రాయితీతో చెల్లించేందుకు మరో నాలుగు రోజుల గడువు మాత్రమే ఉందని పోలీసులు తెలిపారు. 3.59 కోట్ల పెండింగ్ చలాన్లకు గాను ఇప్పటి వరకు 1,52,47,864 చలాన్లు చెల్లించారు. వీటి ద్వారా రూ.135 కోట్ల ఆదాయం వచ్చింది.

# ఫిబ్రవరి ఒకటిన ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**జనవరి 27 : మరో ఉదయం**



ఫిబ్రవరి ఒకటో తేదీన గజ్వేల్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ సమక్షంలో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం చేయనున్నారు. నవంబర్‌లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడయ్యాయి. అదే నెల 9న కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులతో ప్రోటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ ప్రమాణస్వీకారం చేయించారు.అంతకు ముందురోజు అర్ధరాత్రి కేసీఆర్ ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కాలుజారి పడిపోగా తుంటికి గాయమైంది. ఆ తర్వాత యశోద ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకున్నారు. ఇటీవల ఆయన కోలుకున్నారు. ప్రస్తుతం ఊతకర్ర సహాయంతో నడుస్తున్నారు. ఇదిలా ఉండగా.. గజ్వేల్‌లో కేసీఆర్ వరుసగా మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేశారు. ఎన్నికల్లో ఆయనకు 1,11,684 ఓట్లు పోలయ్యాయి. 45వేలకుపైగా మెజారిటీ బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్‌పై విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం నుంచి గజ్వేల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తూ వస్తున్నారు.

మార్పు కోసం... మరో ఉదయం TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## ఎంపిల పోరాటానికి ఇదే చివరి అవకాశం !

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి జరుగబోతున్నాయి. ఇంతకాలం విభజన సమస్యల మిన్నకున్న తెలుగు ఎంపిలు ఇక ఎంతమాత్రం ఉపేక్షించరాదు. ఖచ్చితంగా కేంద్రాన్ని నిలదీయాల్సిందే. అవసరమైతే ఉమ్మడిగా ముందుకు కదలాలి. పార్టీలకు అతీతంగా ఎంపీలంతా ఏకం కావాలి. సోమవారం నుంచి సమావేశాలు జరుగబోతున్న తరుణంలో తెలుగు రాష్ట్రాల ఎంపిలు తమ రాష్ట్రాల సమస్యలపై గళం విప్పాల్సి ఉంది.విపక్షాలు కూడా సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌లో అవకాశాలు వచ్చినా వదులు కుని, గొడవలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సమస్యను సమస్యగా చర్చించడంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు పూర్తిగా విఫల మయ్యారు. పార్లమెంటులో సమస్యలను ప్రస్తావించడం కన్నా గొడవ చేసి వాయిదా వేయించడంలోనే కాలం గడుపుతున్నారు. కనీసం ఈ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అయినా దేశం, ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై సమగ్ర చర్చకు పట్టుబట్టాలి. అందుకు అనుగుణంగా వాతావరణం సృష్టించుకోవాలి.ఇంతకాల ఏదో ఒక విధంగా తప్పించుకుంటున్న తీరు ఇప్పుడు ఇక చెల్లబోదు. ఎన్నికల సీజన్‌లో ప్రజల ముందుకు వెళ్లబోతున్న తరుణంలో పార్లమెంటులో సమస్యలను చర్చించాల్సిన అవసరం ఉంది. ఇంతకాలం మొహం చాటేసినా చెల్లింది. ఇక చెల్లదన్న విషయం పాలక, విపక్ష పార్టీలు గుర్తించాలి. బిజెపి కూడా ఇంకెంతోకాలం మభ్యపుచ్చే మాటలతో ప్రజలను మోసగించలేదు. రాష్ట్ర విభజన పక్రియపై కాంగ్రెస్‌ను విమర్శిస్తూ వచ్చిన మోడీ..సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ పరువు తీయాలన్న లక్ష్యాన్ని ఎంచుకున్నరే తప్ప తెలుగు రాష్ట్రాల సమస్య లు మాత్రం పరిష్కారం కావడం లేదు. రాష్ట్ర విభజనను కాంగ్రెస్ ప్రజాస్వామిక పద్ధతిలో చేయలేదన్న భావన ఉంటే.. సమస్యలను ఏ విధంగా పరిష్కరించారో..చెప్పుకునేందుకు మోడీకి, బిజెపికి కూడా ఏమీ లేదు. ఎందుకంటే ఎపికి ఒక్కటంటే ఒక్క ప్రయోజనం కూడా చేకూరలేదు. చర్చకు తావులేకుండా అహం కారంతో నాటి కాంగ్రెస్ వ్యవహరించిందని మోదీ వాదనగా ఉంది. విశాఖ ఉక్కు, బయ్యారం ఉక్కు, కడప ఉక్కులపై నిర్మొహమాటంగా తేల్చాలి. కృష్ణా జలాలలపైనా పంచాయితీ తేల్చాలి. గత తొమ్మిదన్నరేళ్లుగా అనేక సమస్యలు ఉన్నా వాటిని చర్చించడం లేదు. విభజన పక్రియ ఇరు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు పుట్టించింది. ఇది ఎవరూ కాదనలేని నిజం. ఇప్పటికీ నష్టం చేస్తున్నదని..ఎపి ప్రజలు వాపోతున్నదీ కూడా నిజమే. సానుభూతికన్నా సమస్యల పరిష్కారం ముఖ్యమన్న ధోరణిలో ప్రజలు ఉన్నారు. విభజన తరవాత ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు మానసికంగా స్థిరపడి పోయారు. ఎవరికి వారు బతుకుతున్నారు. ఈ స్థితిలో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించేలా కాకుండా ప్రధాని మోడీ సమస్యలను పరిష్కరించే పెద్దరికం తీసుకోవాలి. ఏ పనిచేసినా అది ఈ దేశ భవిష్యత్ కోసమే అని గుర్తించాలి. కేంద్రం విభజన హామీలను నెరవేర్చడం లేదన్న ఆగ్రహంతో ఉన్న ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. బిఆర్ఎస్ ఎంపిలు గళం విప్పుతారని పార్లమెంటరీ సమావేశంలో కెసిఆర్ తెలిపారు. ఎపిలో అధికార వైసిపి పట్టించుకోక పోయినా విపక్షాలు సమస్యలపై నిలదీస్తున్నారు.మోడీ తీరుపై తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు మోడీపై విమర్శల దాడికి పూనుకున్నాయి. తిరుపతి పుణ్యక్షేత్రంలో మోదీ ఎన్నికల ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తానని ప్రమాణం చేసినా నెరవేర్చ లేదు. సరికాదా రకరకాల విన్యాసాలు చేశారు. కడప ఉక్కు సంగతి పక్కన పెడితే ఉన్న విశాఖ ఉక్కును తుక్కుగా అమ్మడానికి సిద్దం అయ్యారు. ఇది నిజంగానే ప్రజలకు ఆగ్రహం తెప్పించే విషయం. ఉద్యమం ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టడం ప్రజల సెంటిమెంట్‌ను

దెబ్బకొట్టడమే. అమరావతి ఉద్యమం సాగుతున్న వేళ వారికి కనీస స్వాంతన చేకూర్చే ప్రయత్నం చేయలేదు. ఆదానీ,అంబానీ లాంటి వారికి మాత్రమే మోదీ అండగా ఉంటున్నారన్న భావన ప్రజల్లో బాగా బలపడిపోయింది. పేదలను నిరుపేద లుగా మార్చేస్తున్నారన్న విమర్శలకు మీడియా ద్వారా బాగా ప్రాచుర్యం వస్తోంది. పలు ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకానికి పెట్టడం, వాటిని సక్రమంగా నిర్వహించలేక చేతులెత్తేయడం..నీరవ్ మోడీ, విజయ్ మాల్యా లాంటి వారిని దేశం దాటించడం వంటి వాటిపైనా ప్రజలకు అనుమానాలు ఉన్నాయి. ఇవన్నీ మోడీ నేతృత్వంలో జరిగినవే అన్న భావనా ఉంది. అయితే అనేక బిల్లులను మోడీ కూడా అలాగే చేశారు. పెరుగు తన్న నిత్యావసర ధరలు, పెట్రలో ధరలు, గ్యాస్ ధరలు, ఇంటి నిర్మాణ ధరలు.. జిఎస్టీ వాతలు వంటి వాటి ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నాయో అనుభవిస్తున్న ప్రజలకు మాత్రమే తెలుసు. పార్లమెంట్ సమావేశాల్లో వాటిగురించి ప్రస్తావించకుండా ఉండేందుకు బిజెపి ముఖ్యంగా మోడీ ఎన్నో ఎత్తుగడలు వేస్తున్నారన్న భావన ప్రజల్లో ప్రబలుతోంది. నిజానికి మోడీ వచ్చాక ఓ బృహత్తర భారతం ఆవిష్కృతం అవుతుందని అంతా భావించారు. ప్రధానంగా సామాన్యులు చాలా ఆశ పడ్డారు. కానీ జరిగింది అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఢిల్లీలో కూర్చుని తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా సామాన్యులు అతలాకుతలం అవుతున్నారు. అచ్ఛేదిన్‌కు నిర్వచం లేకుండా పోయింది. కేవలం కొందరి స్వార్థం కోసం, కొందరి ప్రయోజనాల కోసం 90శాతం భారతీయులు ఇబ్బందులు పడుతున్నా.. మోడీ ఏనాడూ దానిపై చర్చించడంలేదు. పోరాటాలు చేస్తే తప్ప మోడీ దిగిరాడని ఉమ్మడి ఎపి ఎంపిలు కూడా గుర్తించాలి. తమ స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి పార్లమెంట్ వేదికగా ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి. రాష్ట్ర బిజెపి నేతలు కూడా విమర్శలు, ఎదురుదాడి విధానాలు, అధికారమే లక్ష్యంగా పనిచేసే పద్దతిని వీడాలి. విభజన సమస్యలపై పార్టీలో అంతర్గతంగా చర్చజరగడం లేదు. అయినా ఈ దేశాన్ని ఉద్ధరించే మహానుభావుడన్న రీతిలో మోడీని సోషల్ మీడియా వేదికగా పొగడ్తలతో ముంచెత్తే ప్రచారంలో బిజెపి నేతలు పోటీపడుతున్నారు. దేశంలో అనేక భయాలు వెన్నాడుతున్నా వాటిని సవరించి ఆదుకుంటా మన్న ఒక్కమాట కూడా ప్రభుత్వం నుంచి రావడం లేదు. దీంతో ప్రజలకు మోడీ ప్రభుత్వం భరోసాగా లేదన్న విషయం అర్థం అవుతోంది. ఎన్నికలకు వెళుతున్న వేళ ఇవే చివరి పార్లమెంట్ సమావేశాలు కావడంతో ఇక ఎంతమాత్రం ఉపేక్షించరాదు. సమస్యలను ప్రస్తావించి చర్చించేందుకు ఎంపీలంతా కట్టుబడి పనిచేయడం ముఖ్యం.

## శ్రీ నాగార్జున స్టార్ కిడ్స్ విద్యాలయ హై స్కూల్లో సైన్స్ ఫెయిర్.

**మరో ఉదయం ప్రతినిధి శేర్లింగంపల్లి**

కూకట్ పల్లి ఆల్విన్ కాలనీ లోని శ్రీ నాగార్జున స్టార్ కిడ్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ కరస్పాండెంట్ కమలాకర్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులచే సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సైన్స్ ఫెయిర్ ద్వారా పిల్లలకు సబ్జెక్టు మీద అవగాహన పెంచుకునే అవకాశం ఉందని పిల్లలకు స్కూల్ టీచర్స్ పేరెంట్స్ వారికి ఇంట్రెస్ట్ ఉన్న రంగాల్లో ప్రోత్సహించడం ద్వారా వారు అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు టీచర్స్, పిల్లల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.



## ఎన్ పిఅర్డి క్యాలెండర్ ఆవిష్కరణ చేసినా అడిషనల్ కలెక్టర్ గోపాల్ రెడ్డి

### అంగవైకల్యం పట్ల ప్రతి ఒక్కరు అవగాహనా కలిగి ఉండాలి
### వికలాంగులు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 27 : మరో ఉదయం**

సమాజంలో ప్రతి ఒక్కరు అంగవైలక్యం పట్ల అవగాహనా కలిగి ఉండాలని,వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వలు అమలు చేస్తున్న పథకాలను వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ గోపాల్ రెడ్డి అన్నారు. శనివారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్ పి అర్ డి -2024 క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం అనేక చట్టాలను అమలు చేస్తున్నాయని అన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో వికలాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వికలాంగులను అవమాన పరిచే విధంగా మాట్లాడడం 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం నేరమని అన్నారు.అంగవైకల్యం శరీరానికే తప్ప ప్రతిభకు కాదని అనేక మంది నిరూపించారాని అన్నారు. వైఖల్యం ఉన్న పట్టుదలతో ముందుకు వెళ్లాలని సూచించారు.వైఖల్యం కలిగిన పిల్లలు చదువుకునే విదంగా తల్లిదండ్రులు ప్రోత్సాహించాలని అన్నారు.వికలాంగుల కోసం ఉన్న చట్టాలు, జీవో ల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని అన్నారు.జిల్లాలో ఉన్న వికలాంగులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. 2024 నూతన సంవత్సరం క్యాలండర్ ను ఎన్ పి అర్ డి ముద్రించడం అభినందనీయమని అన్నారు. గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తినడం ద్వారా అంగవైకల్యాన్ని నిర్మూలించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ పి అర్ డి జిల్లా అధ్యక్షులు అశన్నగారి భుజంగారేడ్డి ప్రదన కార్యదర్శి జేర్కోని రాజు జిల్లా సహయ్య కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్ జిల్లా నాయకుడు అంతటి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయండి...

### బండి రమేష్

**మరో ఉదయం ప్రతినిధి కూకట్పల్లి**

కూకట్పల్లి నియోజకవర్గ మూసాపేట్ కు చెందిన చును పాషా సొంతగూటికి మళ్ళీ చేరారు. కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ను మియాపూర్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో మరింత అభివృద్ధి చెందే విధంగా చూడాలని కాలనీ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని వారికి బండి రమేష్ హామీ ఇచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందే విధంగా చూడాలని తెలిపారు. మూసాపేట్ కి చెందిన చూను పాషా, వహీద్, లక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి బండి రమేష్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ గోపిశెట్టి రఘు, తూము వేణు, సతీష్ గౌడ్ డివిజన్ ప్రెసిడెంట్, తూము సంతోష్, స్వరూప,ఎల్లేష్, లక్ష్మయ్య,నయీమ్, సచిన్, షకీల్, వెంకటేష్ యాదవ్, ఇర్ఫాన్, అమీర్, కాజా పాషా,మోయిన్ తదితరులు పాల్గొన్నారు.



## కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయండి

### జిల్లా నేత జయప్రకాశ్
### రాష్ట్ర మంత్రి కి వినతి

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారా మెడికల్ సిబ్బందిని తక్షణమే పర్మినెంట్ చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ గారికి పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఐ ఎన్ టి యు సి జోగులాంబ గద్వాల్ జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాశ్ వినతి పత్రం ను అందజేశారు. శనివారం ఎర్రవెల్లి మండల కేంద్రం లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ను కలిసి ఉద్యోగుల సమస్యల తో కూడిన వినతిపత్రాన్ని ఇచ్చారు. అంతకు ముందు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజ నర్సింహ ను జిల్లా నేత జయప్రకాశ్ సారథ్యం లో ఉద్యోగులందరూ శాలువా కప్పి, బొకే తో ఘనంగా సన్మానం చేశారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్స్, స్టాఫ్ నర్స్ లు, లాబ్ టెక్నీషియన్స్, రేడియో లాజిస్ట్స్, సెకండ్ ఏ ఎన్ ఎమ్ లు,ఫార్మసీస్ట్ లు, అందరినీ బేషరతుగా రెగ్యులర్ చేయాలని ఆ వినతి పత్రం లో పేర్కొన్నారు. అలాగే టిబి విభాగం లో పనిచేస్తున్న అన్నీ కేడర్ ల వారిని పర్మినెంట్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే గత 23ఏళ్ళు గా నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న 60మంది పబ్లిక్ హెల్త్ మేనేజర్ లను కూడా పర్మినెంట్ చేయాలని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ ను కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా యూనియన్ నాయకులు హనుమంతు, నర్సింహ, చంద్రన్న,నాగ శేషయ్య, సత్యం, శేఖరయ్య, ఏ ఎన్ ఎమ్ లు పాల్గొన్నారు



## మణుగూరు మున్సిపాలిటీలో మనీ మాయాజాలం

రసీదులు రద్దు.. ఫోన్ పే ముద్దు - ఇంటినెంబర్ మార్చాలా.. మా జేబులు తడపాల..

ఖాళీ స్థలాన్ని కి ఇంటి నెంబర్ కావాలంటే ఫోన్ పే లో డబ్బులు వేయండి ఇంటి నెంబర్ పొందండి..!

కొత్త ఇంటి నిర్మాణం చేసే పేదవారికి మాత్రమే డెబ్రీస్ ఫీజు..!

రాజకీయ నాయకులు కూ ఐటిఐ కాలేజీ యజమానులకు “నో” ఫీజు ..!

సస్పెండ్ అయిన ప్రమోషన్ పై బదిలీ అయిన తిరిగి - మణుగూరు మున్సిపాలిటీ నీ వదిలేదేలే....!

**భద్రాద్రి జిల్లా బ్యూరో కర్నే బాబు జనవరి :27 మరో ఉదయం**

చేతికి డబ్బులోద్దు.. ఫోన్ పే ముద్దు.. అనే కొత్త నినాదంతో మణుగూరు మున్సిపాలిటీలోని కొంతమంది వ్యక్తులు, సామాన్య ప్రజలనుండి ఫోన్ పే ద్వారా లంచాన్ని దండుకుంటున్నారు. మున్సిపాలిటీలో కొందరు అధికారులు చేసే ఆగడాలకు హద్దు అదుపు లేకుండా పోతుందని, అంతా మనీ మాయాజాలంగా నడుస్తుందని మణుగూరుకు చెందిన సామాజిక కార్యకర్త కర్నె రవి ఆరోపించారు. అధికారుల జేబులు తడపనిదే ఇంటి నెంబర్లు మార్చడం లేదని, లంచం ఇస్తే చిటికెలో మారుస్తున్నారని, మున్సిపాలిటీ మొత్తం అవినీతి కంపులో కూరుకుపోయిందని అన్నారు. అనుకున్న మొత్తం ముట్ట చెబితే, నిబంధనలను తుంగలో తొక్కి ఇంటి నెంబర్ను ఒకరి పేరు నుండి మరొకరి పేరుకు తక్షణమే మార్పిడి చేస్తున్నారని అన్నారు. రసీదుల ద్వారా కాకుండా ఫోన్ పే ద్వారా డబ్బులు తీసుకుంటూ, వారి సొంత అవసరాలకు ఉపయోగించుకుంటున్నారని.. అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని కర్నె రవి అన్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న ఈ తత్తంగంపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి, అవినీతి అవకతవకలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మరో ఉదయం

# కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయండి
## - బండి రమేష్

**కూకట్పల్లి మరో ఉదయం న్యూస్:**

కూకట్పల్లి నియోజకవర్గ మూసాపేట్ కు చెందిన చును పాషా సొంతగూటికి మళ్ళీ చేరారు. కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ను మియాపూర్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో మరింత అభివృద్ధి చెందే విధంగా చూడాలని కాలనీ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని వారికి బండి రమేష్ హామీ ఇచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా వారికి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందే విధంగా చూడాలని తెలిపారు. మూసాపేట్ కి చెందిన చూను పాషా, వహీద్, లక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి బండి రమేష్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ గోపిశెట్టి రఘు, తూము వేణు, సతీష్ గౌడ్ డివిజన్ ప్రెసిడెంట్, తూము సంతోష్, స్వరూప,ఎల్లేష్, లక్ష్మయ్య,నయీమ్, సచిన్, షకీల్, వెంకటేష్ యాదవ్, ఇర్ఫాన్, అమీర్, కాజా పాషా,మోయిన్ తదితరులు పాల్గొన్నారు.



# పార్లమెంటు ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలి
## ఏఐసీసీ తెలంగాణ కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ సుజాత పాల్."

**కూకట్పల్లి మరో ఉదయం న్యూస్:**

పేద ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతుంది - టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల 2024 కోసం గాంధీ భవన్ లో కార్యవర్గ, సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఐసీసీ తెలంగాణ కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ సుజాత పాల్ ని శాలువాతో సత్కరించిన పీసీసీ వైస్ ప్రెసిడెంట్ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షులు సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి, అధికార ప్రతినిధులు డా. సత్యం శ్రీరంగం, కాల్వ సుజాత, భవానీ రెడ్డి, సంధ్యా రెడ్డి. ఈ సందర్భంగా సుజాత పాల్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తీసుకోవలసిన చర్యలు, పార్టీ శ్రేణులకు చేయవలసిన దిశా నిర్దేశాల గురించి టిపిసిసి అధికార ప్రతినిధులకు వివరించి, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో దేశంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ అన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ నేడు మన ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఆరు గ్యారెంటీ పథకాల దరఖాస్తుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, పేద ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతుందని, దగాపడ్డ తెలంగాణ ప్రజలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.



# ప్రైవేట్ విద్యలో డొల్లతనం
## వేలల్లో ఫీజులు వసూలుకే మొగ్గు

**హైదరాబాద్,జనవరి27(మరో ఉదయం):**

జిల్లాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో శిక్షణ, అనుభవం లేని ఉపాధ్యాయుల తోనే నెట్టుకొస్తున్నారని విద్యాశాఖ నిర్వహించిన సర్వేలో తేలింది. కొన్ని పాఠశాలలు కేవలం పై మెరుగుల తో విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. వేలల్లో ఫీజులు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలల్లో కొన్నిటిలో మాత్రమే కనీస సామర్థ్యాలు కనిపించాయి. గురుకులాల ఏర్పాటుతో అక్కడ చదువుతున్న విద్యార్థులు ఇందులో చేరుతున్నారు. ఇక్కడ చేరిన విద్యార్థుల నైపుణ్యాలు పరిశీలించగా ఈ విషయాలు బయట పడుతున్నాయని పలువురు ఉపాధ్యాయులు వెల్లడించారు. ప్రైవేట్ పాటశాలల్లో విద్య మిధ్య అన్న నిజాన్ని అధికారులు గుర్తించారు. చాలాచోట్ల బట్టీ విధానం తప్ప పిల్లలకు అవగమయ్యే రీతిలో బోధించడం లేదని గుర్తించారు. పలు ప్రైవేటు పాఠశాలల్లో గైడ్లు, పుస్తకాలపైనే ప్రధానంగా ఆధారపడుతున్నట్లు గుర్తించారు. తాజాగా గురుకులాలు మొదలయ్యాక అనేకమంది తల్లిదండ్రులు తమ పిల్లను ఇందులో చేర్చడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనికితోడు పైసా ఖర్చు లేదన్న భావనలో తల్లిదండ్రులు ఉన్నారు. ఇదే సమయంలో పలుచోట్ల ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించినప్పుడు డొల్ల బయటపడుతోంది. ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారే తప్ప విద్యార్థులకు అర్థమవుతుందో లేదో పట్టించుకోవటం లేదని తేలిపోయింది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులే మెరుగైన సామర్థ్యాలు కనబరిచారు. కొన్ని పాఠశాలల్లో అక్షరాలను కూడా గుర్తించలేకపోయారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచే లక్ష్యంతో నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఈ)విధానాన్ని అమలుచేస్తున్నారు. ప్రధానంగా పదో తరగతి విద్యార్థులపై దృష్టిసారించగా అనేక లోపాలు బయటపడ్డాయి. నాలుగు భాగాలుగా నిర్వహించే నిర్మాణాత్మక మూల్యాంకనంలో అనేక లోపాలు కనిపించాయి. గతేడాది కంటే ఈ ఏడాది పరిస్థితి కొంత మెరుగుపడటం ఊరటనిచ్చే అంశం. ప్రాక్టికల్ బోధనతో విద్యార్థుల్లో ఆలోచనలు, శక్తి సామర్థ్యాలు పెంచడం, భావాలను రాత, మాటల రూపంలో వ్యక్తీకరించేలా తీర్చిదిద్దేందుకు నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఈ) విధానాన్ని ప్రభుత్వం అమలుచేస్తోంది. ఇది జిల్లాలో సరిగ్గా అమలు కావటం లేదు. కనీస సామర్థ్యాలు లేక విద్యార్థుల్లో సృజనాత్మకత కరవైంది. నైపుణ్య సాధనలో వెనుకబడింది. ప్రభుత్వ పాఠశాలల్లో సంగ్రహణాత్మక మూల్యాంకనం అమలు బాగుందని గుర్తించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సీసీఈ విధానం అన్ని విధాలుగా అమలయ్యేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన డిజిటల్ తరగతుల నిర్వహణలోనూ ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇదంతఆ ఒక ఎత్తయితే చాలా ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రులను మెప్పించడానికి మార్కులు వేసి చూపుతున్నారు.

# శక్తిపీఠాని దర్శించుకున్న మంత్రి

**(అలంపూర్ మరో ఉదయం న్యూస్)**

అలంపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి కాంగ్రెస్ పార్టీ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకి అలంపూర్ చౌరస్తా లోని ఘన స్వాగతం పలకడానికి మాజీ ఎమ్మెల్యే అబ్రహం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలంపూర్ లోని ఐదవ శక్తిపీఠ మైన జోగులాంబ దేవాలయానికి చేరుకుని ఆలయ చైర్మన్ ఆలయ ఈవో అర్చకులు వీరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి బాల బ్రహ్మేశ్వర స్వామికి అభిషేకం చేయించి జోగులాంబ అమ్మవారికి కుంకుమార్చన చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అర్చకులు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ అలంపూర్ జోగులాంబ టెంపుల్ కు 100 కోట్లు ఇస్తానన్న గత ప్రభుత్వం కేసీఆర్ మోసం చేశారు అమ్మవారు దయవల్ల తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి సీఎంగా గెలుపొందడం ఎంతో సంతోషకరమని అన్నారు రాబోయే రోజుల్లో అలంపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పనులు చేయించి గుర్తింపు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు అదేవిధంగా అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన ఎన్నికల ముందు అసంపూర్తిగా ఉన్న ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని పెండింగ్ పనులను విధులు మంజూరు చేసి తొందరగా పూర్తి స్థాయిలో ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులో తెస్తానని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సంతోష్ ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మాజీ ఎమ్మెల్యేలు సంపత్ కుమార్ అబ్రహం జిల్లా జడ్పీ చైర్మన్ సరిత ఆర్డీఎస్ చైర్మన్ మాజీ సీతారాం రెడ్డి జెడ్పిటిసి కాశ పోగురాజు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి అలంపూర్ ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య ఈవో పురేందర్ కుమార్ వివిధ శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



మొదటిపేజీ తరువాయి

# 10 సీట్లు వచ్చినప్పుడే వెనకడుగు వేయలేదు.. ముళ్లబాట.. పూలబాట
## చూశాం

తెలంగాణ ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు పార్టీ ఎత్తుపల్లాలను ఎన్నింటినో చూసిందన్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ, వడ్లకు రూ. 5వేల బోనస్, రూ. 4వేల పెన్షన్, కరెంట్ బిల్లుల మాఫీ వంటి హామీలు ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. సచివాలయంలో లంకె బిందెలు ఉన్నాయని వస్తే... ఖాళీ బిందెలు కనిపిస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడంపై హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. లంకె బిందెలు ప్రభుత్వ భవనాల్లో ఉంటాయా? లేక పాడుబడిన ఇళ్లలో ఉంటాయా? అని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నవాళ్లకు ఓపిక ఉండాలని హితవు పలికారు. ఇచ్చిన హామీలను ఎలా ఎగ్గొట్టాలా? అని కాంగ్రెస్ ఆలోచన చేస్తోందని ఆరోపించారు. అందుకే అప్పులు.. లంకె బిందెలు అంటూ సాకులు చెబుతోందన్నారు. మహాలక్ష్మిలో భాగంగా మహిళలకు రూ. 2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి రెండో వారంలో లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందుగానే ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరా పారడం లేదని మంత్రి కొండా సురేఖ ఆరోపించడం విడ్డూరమన్నారు. రంగనాయకసాగర్ గేట్లు ఎలా వదిలారు? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాలు కాపాడేది కేవలం బీఆర్ఎస్సే అన్నారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# కొత్త జిల్లాలతో తీరని సమస్యలు
## కనీస రహదారికినోచుకోని పల్లెలు

**ఆదిలాబాద్,జనవరి27(మరో ఉదయం):**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల ప్రజలు నేటికీ రహదారి సౌకర్యానికి నోచుకోవడం లేదు. మంచినీటి కోసం గిరిజన గ్రామాలు అల్లాడుతున్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల సమస్యలు దూరం కాలేదు. జిల్లాలను పునర్వ్యవస్థీకరించే ముందు ప్రజల అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాను ఏర్పాటు చేసినా సమస్యలను మాత్రం పరిష్కరించలేకపోయింది. నేటికీ అనేక గ్రామాలకు కాలిబాటలు కూడా లేవు. దీంతో ఇతర గ్రామాలకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా, పంటలను విక్రయిద్దామన్నా కొండలను ఎక్కి దిగాల్సి వస్తుంది. రహదారి, తాగునీరు సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొత్తగా ఏర్పడ్డ ఈ జిల్లాలో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలని స్థానిక గిరిజన సంఘాలు కోరుతున్నాయి. అనేక గిరిజన గ్రామాల్లో నేటికీ విద్యుత్ సౌక్యం లేకుండా పోయింది. ఇలాంటి గ్రామాల్లో అభివృద్ధి మాటెలా ఉన్నా అక్కడికి చేరుకోవడానికి దారులు కూడా లేవు. గిరి ప్లలెలకు రహదారి, విద్యుత్తు సౌకర్యం కల్పించ డానికి కృషి చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. ఆయా గూడాల్లోని గ్రామాల్లో నేటికీ బోరు మాత్రమే ప్రజల నీటి అవసరాలను తీరుస్తోంది. అనేక గ్రామాల్లో ఇప్పటికీ చెలిమెలు, వాగు నీటితోనే గొంతు తడుపుకొంటున్నారు. గిరిజనుల గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరవయ్యాయి. ప్రధానంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదంతో పలుచోట్ల గ్రామీణులు నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. దట్టమైన అడవుల్లో, మొనదేలిన రాళ్ల మధ్య నడుస్తూ బతుకుపోరాటం చేస్తున్నారు. చినుకు పడితే కాలు తీసి ముందుకు వేయలేని విధంగా బురద దారులు, వంతెనలు లేని అనేక గ్రామాల ప్రజలు వర్షాకాలం బాహ్య ప్రపంచానికి దూరం అవుతున్నారు. విద్యుత్ వెలుగులు, తాగు నీరు, రహదారులు వంటి సదుపా యాలు కొరవడిన గ్రామాల్లో ప్రజలు అవస్థలుపడటం పరిపాటిగా మారింది. ఓటర్లుగానే తప్పితే మనుష లుగా తమను నాయకులు గుర్తించడం లేదంటూ గిరిజనులు వాపోతున్నారు. కొండకొనలతో సహజీవనం చేస్తూ, మౌలిక సదుపాయాలు కొరవడి అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న పల్లెలపై నేతలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గ్రామాలు ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ విద్యుత్తు వెలుగులకు నోచుకో లేదు.

# నేతల ఆక్రమణలో చెరువు శిఖాలు
## చెరువుల శిఖం ఆక్రమణలపై తేలని పంచాయితీ?

**హైదరాబాద్,జనవరి27(మరో ఉదయం):**

హైదరాబాద్ నగరంతో పాటు శివారుల్లో చెరువుల ఆక్రమణకు గురికావడం, కోర్టు కేసుల్లో ఉండడం వల్ల వాటి అభివృద్ధికి ఆటంకంగా మారింది. రియల్టరల దందాలకు చెరువులు మాయం అయ్యాయి. అనేక చెరువుల ఉనికి లేకుండా పోయింది. నగర చుట్టుపక్క ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో చెరువులను మింగుతున్నారు. శిఖం భూములు మొత్తం ఇప్పుడు అపార్ట్మెంట్లుగా, విల్లాలుగా మారాయి. గతంలో వర్షాలకు ఈ విల్లాలలు నీట మునిగిన సంగతి తెలిసిందే. దీనికితోడు స్థానిక నేతలు కబ్జాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నేతలపై ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యేలు, వారి అనుచరుల కబ్జాలపై ఫిర్యాదు చేసినా గత ప్రభుత్వంలో పట్టించుకున్న దాఖలాలు లేవు.

# నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు తప్పవు
## - ఎస్ఐ వెంకటప్పయ్య

**భద్రాద్రి జిల్లా బ్యూరో కర్నే బాబు జనవరి:27 మరో ఉదయం**

నంబర్ ప్లేట్ లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వెంకటప్పయ్య హెచ్చరించారు . శనివారం పినపాక మండల పరిధిలో సరే వాహన దానికి వీలు చేపట్టారు . ఈ బయ్యారం ఎస్ఐ వెంకటప్పయ్య ఆధ్వర్యంలో కేసులు నమోదు చేస్తున్నారు. నెంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపై తిరిగితే ఆ వాహనాలను స్వాధీనం చేసుకుని వాహనాలను శాంతి భద్రతల పోలీసులకు అప్పగిస్తామన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు, ట్యాంపరింగ్ నంబర్ కలిగిన వాహనాలు, రిజిస్ట్రేషన్ చేసుకోకుండా తాత్కాలిక నంబర్తో తిరుగుతున్న బండ్ల పై కేసు నమోదు చేస్తామన్నారు. రెండువైపులా నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనదారులు నేరాలు చేసేందుకు ఎక్కువ అవకాశముండటంతో అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు తప్పదన్నారు రోడ్లపై ప్రయాణించేటప్పుడు శాంతి భద్రతల దృష్ట్యా కచ్చితంగా ప్రజలు సహకరించాలని కోరారు.



# శారీరక మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయి...
## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**మరో ఉదయం ప్రతినిధి కూకట్పల్లి**

క్రీడలు శారీరిక మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలనగర్ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్లో రాజీవ్ గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని టోర్నమెంట్ నుప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాజీవ్ గాంధీ నగర్ లో క్రికెట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని కులాలకు మతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఉండాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాల్లో ఏర్పాటు చేయడం వలన మానసిక ఉల్లాసంతో పాటుగా ఆరోగ్యాలు కూడా మెరుగుపరుచుకోవచ్చని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ నగర్ అధ్యక్షులు అజీజ్, ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్ , యూత్ అసోసియేషన్ల క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.




# దేశంలో సమస్యల సవారీ
## పార్టీలో ప్రశ్నించే గళం లేని బిజెపి
## మోడీని కీర్తించడంతోలో ముందున్న నేతలు

**న్యూఢిల్లీ,జనవరి27(మరో ఉదయం):**

దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు దిగి రావడంలేదు. ద్రవ్యోల్బణం అదుపు కావడం లేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని కాంక్షించిన ప్రజలు రెండోమారు నరేంద్రమోడీకి అధికారం అప్పగించారు. కానీ జరుగుతున్న దేమిటి..? ప్రజల ధన, మాన, ప్రాణాలకే రక్షణ కరువైపోయింది. దేశంలో ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హవా నడుస్తోంది! ఆయన వ్యూహాల ముందు మిగతా పార్టీల వ్యూహాలు చెల్లకుండా పోతున్నాయి. అందుకే నేనే సుపీరియర్ అనే భావనతో ఆయన వ్యవహరిస్తున్నారు. ఆయన ఇవ్వాళ ఈ స్థాయికి రావడానికి ఆ పార్టీకి చెందిన ఎంతోమంది నాయకులు.. ముఖ్యంగా ఎల్.కె.ఆద్వానీ వంటివారి ఆశిస్సులు ఉన్నాయి. ఇప్పుడు వారినందరినీ ఎక్కడ ఉంచారో అందరికీ తెలిసిందే! ప్రధానమంత్రి కాలేకపోయినా రాష్ట్రపతి అయినా కావాలనుకున్న ఆద్వానీని అడ్రస్ లేకుండా చేశారు. ఒకప్పుడు వేదికలపై ఆసీనులైన బీజేపీ అగ్ర నాయకులను వెన్నంటి తిరిగిన నరేంద్ర మోదీ, ఇప్పుడు అదే నాయకులకు తన ముందు స్వేచ్ఛగా కూర్చోలేని పరిస్థితి కల్పించారు. అంటే పదవితో పాటు గాంభీర్యాన్ని, అహాన్ని సొంతం చేసుకున్నారు. దీంతో ప్రజల సమస్యలపై నేరుగా చర్చించే అవకాశం లేకుండా చేసుకున్నారు. పార్టీలో సమస్యలపై చర్చ జరగడం లేదు. దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకునే వీలు లేకుండా పోయింది. విదేశీ పర్యటనలకు ఇస్తున్న ప్రాధాన్యం దేశంలో సమస్యలు తెలుసుకోవడానికి ఇవ్వడం లేదు. సమస్యలను పరిష్కరించ గలిగామని, వాటిని అధిగమించా మని భావిస్తున్నారు. అదేరీతిలో ప్రజలను నమ్మించడానికి ప్రధాని నరేంద్రమోడీ గత పదేళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. అందుకే నోట్ల రద్దు, జిఎస్టీ వంటి విషయాలను పార్లమెంటులో ప్రస్తావించి చర్చించే ధైర్యం నేటికీ చేయడంలేదు. వాటివల్ల కలిగిన నష్టాలను పూడ్చే ప్రయత్నం కూడా చేయడం లేదు. ఎవరూ ప్రశ్నించడానికి వీలుకాని భారీ బహిరంగసభల్లో మాత్రం అనర్గళంగా మాట్లాడుతూ విపక్షాలను దుమ్మెత్తి పోస్తుంటారు. అలాగే పార్లమెంటులో కూడా తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శిస్తుంటారు. బిజెపిలో పొగడ్తలకు పడిన కారణంగా ప్రజల ఇక్కట్లు వినిపించకపోవచ్చు. అందుకే సమస్యలు పరిష్కారం కాక ప్రజల్లో అసహనం రాజ్యమేలుతోంది. తాము కోరుకున్నదేమిటి? దేశంలో జరుగుతున్న దేమిటి? అనే ప్రశ్న క్రమేణా బలపడుతోంది. అభివృద్ధి పేరుతో, పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రధాని దేశాటనలు చేస్తూ దేశ సమస్యలను మాత్రం నడిబజారులో వదిలారు. వీటికి తోడు రైతుల ఆత్మహత్యలు - ఆక్రందనలు, కార్మికుల ఆందోళనలు పట్టించుకోవడం లేదు. నల్లధనంపై పోరాటంలో తాము రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకున్నామని అంటున్నారు. దేశంలో నల్లధనాన్ని, అవినీతిని నిర్మూలించడానికి పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాని మోదీ పదేపదే చెప్పుకొచ్చారు. ఈ చర్య సత్ఫలితాలు ఇచ్చిందో లేదో మాత్రం చెప్పడం లేదు. నగదు రహిత లావాదేవీల నినాదం కూడా తెరవెనుకకు వెళ్లింది. ప్రజలకు సంబంధించిన విషయాలకన్నా ప్రభుత్వాన్ని నిలబెట్టుకునే ఆలోచనలే మోడీ ముందు ఎక్కువగా ఉంటాయి.

# సినిమా వార్తలు

## ఫిబ్రవరి1 నుంచి విశ్వంభర షూటింగ్

మెగాస్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తరువాత చిత్ర పరిశ్రమ అంతా చిరంజీవిని అభినందన వెల్లువలతో ముంచెత్తారు. చిరంజీవి ఈ అవార్డుకు అన్ని విధాలా అర్హుడు అని కొనియాడారు. ఇదిలా ఉండగా చిరంజీవి తన తదుపరి సినిమా 'విశ్వంభర' ఒక ఫాంటసీ నేపథ్యంలో చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికి మల్లిడి వశిష్ట దర్శకుడు, ఈ సినిమా షూటింగ్ కూడా ఎప్పుడో మొదలైంది. ఈ సినిమాకి ముందుగానే చాలా ప్రీ ప్రొడక్షన్ పనులు జరిగాయి. ఎందుకంటే ఈ సినిమాకి కంప్యూటర్ గ్రాఫిక్స్ చాలా అవసరం అవుతాయి. కొన్ని రోజుల క్రితం ఈ సినిమా రివీల్ చేస్తూ టీజర్ ఒకటి విడుదల చేశారు, అది వైరల్ అయింది కూడా. అయితే ఇప్పుడు చిరంజీవి షూటింగ్ ఎప్పుడు మొదలు పెడుతున్నారు అనే విషయం మీద ఒక అప్డేట్ వచ్చింది. ఫిబ్రవరి 1 నుండి చిరంజీవి ఈ సినిమా షూటింగ్ మొదలెడుతున్నట్టుగా తెలిసింది. నిన్న చిరంజీవిని అభినందించడానికి వచ్చిన వాళ్ళతో పిచ్చా పాటీ మాట్లాడుతూ తాను ఫిబ్రవరి 1 నుండి 'విశ్వంభర' సినిమా షూటింగ్ లో పాల్గొంటున్నట్టుగా చెప్పారు. సుమారు రెండు వారాలు ఈ సినిమా షూటింగ్ లో చిరంజీవి పాల్గొంటారని తెలిసింది. ఆ తరువాత చిరంజీవి ఒక చిన్న బ్రేక్ తీసుకోవడానికి అమెరికా పయనం అవుతున్నట్టుగా కూడా తెలిసింది. తరువాత మళ్ళీ ఈ సినిమా షూటింగ్ లో నిరవధికంగా పాల్గొంటారని తెలుస్తోంది. ఈ సినిమా యూవీ క్రియేషన్స్ నిర్మిస్తుండగా, ఎంఎం కీరవాణి సంగీతాన్ని సమకూరుస్తున్నారు.



## సూర్యతో విడాకులు అంతా తూచ్

### పిల్లల చదువు కోసమే ముంబైకి వచ్చా పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టిన నటి జ్యోతిక



కోలీవుడ్ స్టార్ జంట సూర్య, జ్యోతికలు విడాకులు తీసుకోనున్నట్లు గత కొన్నాళ్లుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా జ్యోతిక కుటుంబానికి దూరంగా ఉంటూ ముంబైలో ఉంటున్నారు. కుటుంబంలో గొడవలు ఉన్నా పిల్లల చదువుల కోసమే ముంబైకి షిఫ్ట్ అయినట్లు జ్యోతిక క్లారిటీ ఇచ్చారు. అయితే వీరిమధ్య గొడవలు తారాస్థాయికి చేరుకున్నాయని సూర్య, జ్యోతికలు విడాకులు తీసుకుంటున్నారని వార్తలు ఒక్కదాని వెంట మరొకటి వస్తూనే ఉన్నాయి. కుటుంబ కలహాలతోనే వీరు ముంబైలో ఉంటున్నారన్న వార్తలు మాత్రం హల్చల్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా ఈ వార్తలపై జ్యోతిక మొదటిసారిగా స్పందించారు. నాకు సూర్యకు మధ్య ఎలాంటి గొడవులు లేవు. పిల్లల చదువుతో పాటు తను బాలీవుడ్ సినిమాలకు కమిట్ అవ్వడం.. నా తల్లిదండ్రుల ఆరోగ్యం బాగొలేకపోవడం వంటి కారణాలతో తాను ముంబైకు షిఫ్ట్ అయినట్లు చెప్పుకొచ్చారు జ్యోతిక. సూర్య చాలా మంచి వ్యక్తి అని.. మా ఇద్దరికీ విడాకులు తీసుకునే ఆలోచన లేదని చెప్పింది. పిల్లల చదువులు పూర్తవ్వగానే తాము చెన్నై తిరిగి వస్తామని జ్యోతిక వెల్లడించింది.

## గజిబిజి గందరగోళంగా కెప్టెన్ మిల్లర్

తమిళ సినిమా 'కెప్టెన్ మిల్లర్' అదే పేరుతో తెలుగులోకి డబ్బింగ్ చేసి విడుదల చేశారు. ధనుష్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా తమిళంలో సంక్రాంతికి అంటే జనవరి 12న విడుదల చేశారు. అక్కడ ఈ సినిమాకి మిశ్రమ స్పందన వచ్చింది. ఇది ఒక పీరియడ్ డ్రామా, బ్రిటిష్ వారు భారతదేశాన్ని పాలిస్తున్న రోజులనాటి కథ. ఈ సినిమాలో కన్నడ నటుడు శివరాజ్ కుమార్, తెలుగు నటుడు సందీప్ కిషన్ ప్రత్యేక పాత్రల్లో కనపడతారు. ఈ సినిమాకి కథతో పాటు దర్శకత్వం కూడా అరుణ్ మతీశ్వరన్ చేశారు. ధనుష్ కెరీర్ లో ఈ సినిమా బ్జడెట్ ఎక్కువ పెట్టిన తీసినది. ఈ కథ బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశాన్ని పాలిస్తున్న రోజుల్లో, సంస్థానాలు, రాచరికాలు కూడా వున్న ప్రదేశంలో, సుమారు 1930లో జరిగే కథ. అగ్నీశ్వర (ధనుష్) ఒక గ్రామంలో తన తల్లితో ఉంటూ ఉంటాడు, కానీ అతనికి, అతని సహచరులకు ఆ గ్రామంలో కుల వివక్ష కారణంగా గుడిలోకి అడుగుపెట్టనీయరు. కనీసం గౌరవం సంపాదించాలంటే సైన్యంలో చేరితే వస్తుంది అని బ్రిటిష్ సైన్యంలో చేరతాడు. బ్రిటిష్ ప్రభుత్వం అందరికీ పేర్లు మారుస్తూ ఉంటుంది, ఇతనికి మిల్లర్ అని కొత్త పేరు ఇస్తారు. బ్రిటిష్ సైన్యంలో ఉంటూ ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న భారతీయుల్ని చంపుతాడు మిల్లర్, అలా కొంతమందిని చంపాక కోపం వచ్చి తన పై వున్న బ్రిటిష్ అధికారిని చంపేస్తాడు. బ్రిటిష్ ప్రభుత్వం మిల్లర్ ని పట్టుకోబోతే తోటి సైనికుడు రఫీక్ (సందీప్ కిషన్) సాయంతో తప్పించుకుంటాడు. అక్కడి నుంచి అగ్నీశ్వర అలియాస్ మిల్లర్ దొంగగా మారతాడు. ఒకసారి అగ్నీశ్వరని సిపాయిల బారి నుంచి ఆ ఊరి మహారాజు కుటుంబానికి చెందిన అమ్మాయి భానుమతి (ప్రియాంక అరుల్ మోహన్) రక్షిస్తుంది. దొంగగా మారిన మిల్లర్ కి ఊరి గుడిలోని విగ్రహాన్ని దొంగిలించి తెమ్మని చెపుతారు, అతను సరే అంటాడు. ఇంతకూ మిల్లర్ దొంగతనం చేసిన ఆ విగ్రహం ఎవరిది? దానికి ఆ ఊరుకి సంబంధం ఏంటి? శివన్న (శివరాజ్ కుమార్) ఎవరు, అతని పాత్ర ఏంటి? శివన్నకి, మిల్లర్ కి ఎటువంటి సంబంధం వుంది, ఇవన్నీ సినిమా కథగా మలిచారు. కుల వ్యవస్థ, పోరాటాలు సినిమా ప్రారంభం అవటం బాగానే వుంది, కానీ ఆ తరువాతే గాడి తప్పుతుంది. ఫ్లాష్ బ్యాక్ లోకి కథ రావటం, మళ్ళీ ముందుకి వెనక్కి ఇలా ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా పూర్తిగా యాక్షన్ నేపథ్యంలో సాగే సినిమాగా మలిచాడు దర్శకుడు. ఒక దశలో అయితే సినిమా ఎప్పుడు అయిపోతుందా అని ప్రేక్షకుడు అనుకునేట్టు చేసాడు దర్శకుడు. కథ నేపథ్యం ఎప్పుడో 1930 సంవత్సరం కాలం నాటిది కానీ గ్రామంలో మగ్గుతున్న ప్రజలకి ఆధునిక ఆయుధాలు రావటం, అవి ప్రయోగించే విధానం తెలియటం ఆ పోరాట సన్నివేశాలు కథ ఎక్కడ నుంచే ఇంకో దగ్గరికి వెళ్లి అసలు ఏమి జరుగుతోందో కూడా అర్థం కాదు. దర్శకుడు దృష్టి పెట్టి ఉంటే ఈ సినిమా మరింత మంచిగా సాగేది. చివరగా, 'కెప్టెన్ మిల్లర్' సినిమా ఒక మంచి కథతో ప్రారంభం అవుతుంది, బ్రిటిష్ ప్రభుత్వ అండతో అక్కడ వున్న రాచరిక కుటుంబాలు ఒక కులం వారిని ఎలా అణగదొక్కుతున్నారు, ఇంకో పక్క బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకత ఈ నేపథ్యంలో ఉండాల్సిన కథ ఎక్కడికో వెళ్ళిపోయి ప్రేక్షకుడికి నిరాశ పరిచింది.




## కంగువలో విలన్ పాత్ర పోస్టర్ విడుదల


ప్రస్తుతం చాలావరకు హీరోలు పాన్ ఇండియా ప్రాజెక్ట్స్‌పై ఫోకస్ పెడుతున్నారు. పైగా ఈ ప్రాజెక్ట్స్ తెరకెక్కించే క్రమంలో బ్జడెట్ విషయంలో కూడా ఏ మాత్రం కాంప్రమైజ్ అవ్వడం లేదు. అలాంటి హీరోల్లో సూర్య కూడా ఒకరు. ప్రస్తుతం సూర్య 'కంగువ' అనే పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో నటిస్తున్నాడు. ఇప్పటివరకు 'కంగువ' నుంచి విడుదలయిన ప్రతీ గ్లింప్స్, పోస్టర్స్.. సినిమాపై ఆసక్తిని మరింతగా పెంచేశాయి. ఇందులో సూర్య.. మునుపెన్నడూ కనిపించని అవతారంలో కనిపించి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఇక ఈ సినిమాలో విలన్ ఎవరో తాజాగా రివీల్ చేశారు మేకర్స్. వివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కంగువ'లో టైటిల్ రోల్ ప్లే చేస్తున్నాడు సూర్య. ఇక తనను ఢీ కొట్టే విలన్ పాత్రలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ నటిస్తున్నట్టు మేకర్స్ తాజాగా రివీల్ చేశారు. జనవరి 27న బాబీ డియోల్ పుట్టినరోజు కావడంతో 'కంగువ'లో విలన్ తానే అని చెప్తూ ఒక స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో బాబీ.. ఉధిరన్ అనే పాత్రలో నటిస్తున్నట్టు తెలుస్తోంది. హీరో సూర్య కూడా బాబీ డియోల్‌కు బర్త్ డే విషెస్ చెప్తూ.. ఈ పోస్టర్‌ను తన సోషల్ మీడియాలో షేర్ చేశాడు. 'హ్యాపీ బర్త్ డే బాబీ డియోల్ బ్రదర్. మీ ఫ్రెండ్‌షిప్‌కు థాంక్యూ. కంగువలో గొప్ప ఉధిరన్‌లాగా కనిపించడం కోసం మీ ట్రాన్స్‌ఫర్మేషన్ అదిరిపోయింది. ప్రేక్షకులందరూ ఆయన కోసం ఎదురుచూడండి' అనే క్యాప్షన్‌తో లుక్‌ను ట్వీట్ చేశాడు సూర్య.



## సంఘీ అంటూ రజనీకాంత్‌పై విమర్శలు

### ఇలాంటి వ్యాఖ్యలు సరికాదన్న కూతురు ఐశ్వర్య

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి ఐశ్వర్య రజనీకాంత్ డైరెక్ట్ చేస్తున్న లాల్‌సలామ్ . విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ఐశ్వర్య రజనీకాంత్ ప్రమోషన్స్ వేగం పెంచింది. రిపబ్లిక్ డే కానుకగా ఈ సినిమా ఆడియో లాంఛ్ ఈవెంట్ చెన్నైలో గ్రాండ్‌గా జరిగింది. అయితే ఈ ఈవెంట్‌లో ఐశ్వర్య మాట్లాడుతూ.. రజనీకాంత్ పై వస్తున్న ట్రోల్స్‌పై తాజాగా స్పందించింది. సోషల్‌మీడియాలో మా నాన్న 'సంఘీ' అంటూ కామెంట్స్ వస్తున్నాయి. నిజానికి సోషల్‌మీడియాకు నేను చాలా దూరంగా ఉంటా.. ఆన్‌లైన్ నెగెటివిటీ గురించి నా టీమ్ తరచూ చెబుతుంటుంది. అలాగే నాన్నగారి పై వస్తున్న నెగటివిటీ గురించి కూడా నా టీమ్ ద్వారా తెలుసుకున్నాను. మేమూ మనుషులమే. మాకూ భావోద్వేగాలు ఉంటాయి. ఈ మధ్యకాలంలో నా తండ్రిని 'సంఘీ' (హిందుత్వ ఐడియాలజీని ఫాలో అయ్యేవారు) అంటూ విమర్శలు చేస్తున్నారు. అయితే 'సంఘీ' అంటే మొదట్లో నాకు కూడా తెలిదు. కానీ తర్వాత దానికి అర్థం తెలుసుకున్నా. ఒక రాజకీయ పార్టీ(బీజేపీ)కి మద్దతు ఇచ్చేవారిని 'సంఘీ' అని పిలుస్తారని తర్వాత తెలుసుకున్నాను. రజనీకాంత్ సంఘీ కాదు. నాన్న అలాంటి వారే అయితే లాల్ సలామ్ చిత్రంలో మొయినుద్దీన్ భాయ్ పాత్రలో నటించే వారే కాదు. దయచేసి ఇలాంటివి ఆపండి అంటూ ఐశ్వర్య చెప్పింది. అయితే కూతురు మాటలు విన్న రజనీకాంత్ అక్కడే కన్నీళ్లు పెట్టుకున్నారు.



Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com